క్లుప్తంగా

రహదారి స్థలం పరిశీలన

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రి హైవేకు అనుసంధానం చేసే నేషనల్ హైవే-440 రహదారిలో భూములు కోల్పోతున్న స్థలాన్ని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఎన్‌హెచ్ 440 నిర్మాణంలో భాగంగా 252/3 సర్వే నంబర్‌లోని రైతు జగదీశ్వరరెడ్డి, మరో ముగ్గురు రైతులకు సంబంధించి 59 సెంట్ల భూమిని కోల్పోతున్నట్లు చెప్పారు. రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పరిశీలించామన్నారు. ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చేస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఏఈ సురేంద్రారెడ్డి, మండల సర్వేయర్ మద్దిలేటి, వీఆర్‌ఓ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. అనంతరం పట్టు వస్త్రాలు పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో దర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 32 బృందాలు స్వామి అమ్మవార్ల సన్నిధిలో భజన కీర్తనలు ఆలపించారు.

రేపు 'పల్లెకు పోదాం'

దొర్నిపాడు:మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఈనెల 20వ తేదీన పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని సూచించారు. సచివాలయ ఆవరణలో సంక్షేమ పథకాల ఫెక్సీని గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి అధ్యక్షతన ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు.

ఆర్థిక సాయం


బాండ్ అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): తమతోపాటు చదువుకున్న మిత్రుడు రెండు నెలల క్రితం చనిపోవటంతో ఆయన కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులు బాలయ్య,సుధాకర్, శనివారం మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2002-04లో నర్సోజీతో కలిసి చదువుకున్నామని, ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అండగా ఉండాలని బ్యాచ్ విద్యార్థులందరూ కలిసి కూమార్తె లక్ష్మీ సుమంత పేరుమీద రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్‌ను భార్య రమాబాయికి అందజేశారు. సుమన్, జలీల్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

అక్షితలకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): అయోధ్య పవిత్ర అక్షితలకు శ్రీ కాళి సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ కాళికాంబ దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ నాయకులు పోలేపల్లె సందీప్, ఆరవేటి వాసు మాట్లాడుతూ కర్నూలు నుంచి తీసుకువచ్చిన అక్షితలను భక్తుల నుంచి సేకరించిన అక్షితలతో కలిపి 29 కళశాల్లో నింపి కాళికాంబదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం పట్టణంలో ఊరేగించారు. ఈనెల 22వ తేదీన ఒక్కో మండలానికి ఒక్కో కళశం చొప్పున పంపిణీ చేస్తామన్నారు. విజయ్‌కుమార్ నరసింహ, తిమ్మయ్య, రమేష్,హరి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(అర్బన్): సంప్రదాయ చేతివృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు సబీహ పర్వీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాకారులు, చేనేత కార్మికులకు సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు. దరఖాస్తుదారులు తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాసు పుస్తకాలతో మీసేవా, సీఎస్‌సీ సెంటర్లు, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ పొందిన కుటుంబంలో ఒకరికి మాత్రమే రుణాలు అందుతాయన్నారు. వివరాలకు సెల్ 9849901149, 7981848050 నంబర్లు లేదా kurnool@apsmfc.com లో సంప్రదించాలని కోరారు.

బియ్యపు గింజపై ప్రపంచ కప్



నంద్యాల(అర్బన్): అహ్మదాబాద్‌లో ఆదివారం జరగనున్న వన్డే ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ట్రోఫీ చిత్రాన్ని నంద్యాల పట్టణానికి చెందిన చిత్రకారుడు కోటేష్ బియ్యపు గింజపై గీశారు. ప్రపంచ కప్‌తో పాటు జాతీయ జెండాను మైక్రో బ్రష్‌తో చిత్రీకరించారు.

గ్రంథాలయాలు..విజ్ఞాన కేంద్రాలు

- కొనసాగుతున్న 56వ గ్రంథాలయ వారోత్సవాలు
- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థులకు వివిధ రకాల పోటీలు
- ఈనెల 20వ తేదీన ముగియనున్న వారోత్సవాలు



పాణ్యంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, నంద్యాల గ్రంథాలయంలో పుస్తకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గోస్పాడు: విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లుతున్న గ్రంథాలయాల 56వ జాతీయ వారోత్సవాలు ఈనెల 14వతేదీన ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఏడాది వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 20వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయాలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఉమ్మడి జిల్లాలో 59 గ్రంథాలయాలు ఉండగా, పుస్తక నిక్షిప్త కేంద్రాలు160 ఉన్నాయి. వీటిల్లో లభించే పుస్తకాల సమచాంతోనే ఎంతో మంది ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించారు. రీడర్ ఆన్ డిమాండ్ పేరుతో కూడా పుస్తకాలను అందిస్తున్నారు. అలాగే గ్రంథాలయాలను డిజిటలైజ్ చేస్తున్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వీటన్నింటిలోనూ పోటీలు, ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను జూనియర్, సీనియర్లుగా విభజించి వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కథలు, ఆటలు,క్విజ్, పాటలు, డాన్సులు, కంప్యూటర్,పుస్తక పఠనం తదితర పోటీలు నిర్వహిస్తారు. వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు .

6,01,413 పుస్తకాలు..

ఉమ్మడి జిల్లాల పరిధిలోని గ్రంథాలయాల్లో 6,01,413 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో గ్రేడ్-1లో 2, గ్రేడ్ -2లో 4, గ్రేడ్- 3లో 23, నంద్యాల జిల్లాలో గ్రేడ్- 2లో 7, గ్రేడ్ - 3లో 22 గ్రంథాలయాలు ఉన్నాయి. గ్రామీణ గ్రంథాలయం ఒకటి ఉండగా వాటిలో పోటీ పరీక్షల పుస్తకాలు, నవలలు, చిన్నపిల్లలకు సంబంధించిన పుస్తకాలు, సాధారణ పుస్తకాలు, భక్తి, పురాణాలకు చెందిన పుస్తకాలతో పాటు న్యూస్ పేపర్లు అందుబాటులో ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



గ్రంథాలయాల వినియోగంపై పాఠశాల స్థాయి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏటా గ్రంథాలయ వారోత్సవాల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతో పాటు న్యూస్ పేపర్లు అందుబాటులో ఉంటున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

– పెద్దక్క, జిల్లా గ్రంథాలయ ఇన్‌చార్జి సెక్రటరీ

వారోత్సవ కార్యక్రమాలు ఇలా..

ఈనెల 14న వారోత్సవాలు ప్రారంభం, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహణ, 15న పుస్తక ప్రదర్శన, పఠనం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన, 16న గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేసిన వారి చరిత్రలను తెలియజేయడం, 17న కవి సమ్మేళనం, రచయితల పరిచయం, 18న చిత్రలేఖనం, వ్యాసరచన,క్విజ్,ఇండోర్ క్రీడలు, 19న దిశ యాప్ వినియోగం, మహిళాభివృద్ధిపై అవగాహన సదస్సులు, 20న డిజిటల్ గ్రంథాలయాలు, నచ్చిన పుస్తకం చదవడం, ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

గ్రామాల అభివృద్ధికే గడప గడపకు నిధులు


చాగలమర్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు గడప గడప నిధులు, మరో రూ.20 లక్షలు ఉపాధిహామీ నిధులు విడుదల చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో గొడిగనూరు, చిన్నవంగలి, మల్లెవేముల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ నిధులతో చేపట్టవలసిన పనులపై ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, ఎంపీటీసీలు పత్తి నారాయణ, లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు సంజీవరాయుడు, మౌలిబాషా, ఈదుల సరోజమ్మ, ఉప సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, కో-ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, రామగుర్విరెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, జ్యోతీశ్వరరెడ్డి, పడావుల పెద్ద రాముడు, స్వామి రెడిడ, దస్తగిరి రెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులున్నారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: పెండింగ్‌లోనున్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలానీ శామూన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రాధాన్యత భవనాల ప్రగతి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లోనున్న 96 గ్రామ సచివాలయాలు, 91 రైతు భరోసా కేంద్రాలు,72 హెల్త్ క్లినిక్‌ల పనులు లక్ష్యాలు నిర్దేశించుకుని పూర్తిచేయాలని చెప్పారు. ప్రతివారం 11 గ్రామ సచివాలయాలు, 13 రైతు భరోసా కేంద్రాలు, 10 హెల్త్ క్లినిక్ ల పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు 274 గ్రామ సచివాలయాలు, 199 రైతు భరోసా కేంద్రాలు, 97 హెల్త్ క్లినిక్ భవనాలను సంబంధిత శాఖలకు స్వాధీనం చేశామని పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఈ రామ్మోహన్ వివరించారు. పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఓటరు సర్వే పకడ్బందీగా చేపట్టండి


రుద్రవరంలో బీఎల్‌ఓలకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

రుద్రవరం: ఓటరు సర్వేలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులు బీఎల్‌ఓలకు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరం ఓటర్ల సంక్షిప్త సవరణలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. అక్టోబర్ 27న రాష్ట్ర ముసాయిదా ఓటర్ల ప్రచురించామని, అందులో ఏవైనా పొరపాట్లు ఉంటే తనిఖీ చేసి సరిదిద్దేందుకు సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. 2024 జనవరి 1నాటికి 18ఏళ్లు నిండే యువతీ యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ లేదా స్వయంగా బీఎల్‌ఓల వద్దకు వెళ్లి ఓటు హక్కు దరఖాస్తు పత్రాలు పొందవచ్చని చెప్పారు. మండలంలో చేపట్టిన ఓటర్ సర్వే ఆధారంగా ఇప్పటి వరకు 36,487 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 18,200 మంది పురుషులు,18,287 మంది స్త్రీలు ఉన్నారని, ఓటర్ జాబితా నుంచి ఇప్పటి వరకు 2వేల మంది మృతి చెందిన వారి పేర్లను తొలగించామని వివరించారు. ఓటరు జాబితాను మరింత క్షుణ్ణంగా పరిశీలించి మరణించిన వారి పేర్లు ఉంటే వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దారు రవీంద్ర ప్రసాదు ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలి


19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వపై వివిధ శాఖల ఉద్యోగులతో మాట్లాడుతున్న తహసీల్దారు

రుద్రవరం: తెలుగుగంగ కాల్వల ద్వారా వచ్చే నీరు చివరి ఆయకట్టుకు అందేలా చూడాలని తహసీల్దారు రవీంద్ర ప్రసాదు వివిధ శాఖల అధికారులకు సూచించారు. తెలుగుగంగ 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ నుంచి మండలంలోని అప్పనపల్లె బి.నాగిరెడ్డిపల్లె, ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు,చందలూరు, మందలూరు తదితర గ్రామాల పరిధిలోని పొలాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అయితే మధ్యలో కొందరు రైతులు తమ పొలాలకు నీరు పారించుకునేందుకు అడ్డుకట్టలు వేయడంతో ఆయా గ్రామాల్లోని పొలాలకు నీరందడం లేదు. విషయం తెలుసుకున్న తహసీల్దారు తెలుగుగంగ, వ్యవసాయ, పోలీసు తదితర శాఖల ఉద్యోగులతో శనివారం 19వ బ్లాక్ కాల్వ వెంట వెళ్లి అనధికారికంగా వేసిన అడ్డుకట్టలను తొలగింపజేయించి దిగువకు నీరు పారేలా చర్యలు తీసుకున్నారు.

నీటిని సద్వినియోగం చేసుకోవాలి

దొర్నిపాడు: ప్రస్తుతం కేసీ కెనాల్ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ సూచించారు. శనివారం ఆయన 24, 23, 22, 21 లాక్‌ల వద్ద కేసీ కెనాల్ నీటి ప్రవాహన్ని పరిశీలించారు. చివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు అందిందన్నారు. మోటార్ల ద్వారా నీటి మళ్లించుకోవద్దని సూచించారు.

కరువు ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించాలి


మాట్లాడుతున్న రామకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలోని కరువు ప్రాంతాల్లో కేంద్ర బృందాలు పర్యటించి రైతులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో జరుగుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర 15వ మహాసభల ప్రతినిధుల సభకు శనివారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం అప్పర్ భద్ర ప్రాజెక్టు చేపడతామనగా రూ.5300 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని, ఈ ప్రాజెక్టు కడితే రాయలసీమకు చుక్క నీరు రాదన్నారు. మోదీ ప్రభుత్వం ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్రంలో 440 మండలాలను కరవు ప్రాంతాలుగా గుర్తించి రైతులకు కరవు సాయం అందించాలని డిమాండ్ చేశారు. కరువుపై కేంద్ర మంత్రులకు అవగాహన లేదని, రైతులను పట్టించుకునే పరిస్థితుల్లో అధికారులు లేరని విమర్శించారు. ఈ నెల 20,21 తేదీల్లో విజయవాడలో చేపట్టనున్న 30 గంటల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు శాంతి మాట్లాడుతూ...ఆర్ఎస్ఎస్ భావాజాలాన్ని మోదీ ప్రభుత్వం తీసుకొస్తుందని, సనాతన ధర్మం పేరిట మహిళలను వంటింటి కుందేళ్లుగా మారుస్తుందని మండిపడ్డారు. బాల్యవివాహాలను అరికట్టడంలో విఫలమయ్యిందన్నారు. పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జయలక్ష్మి, దుర్గాభవానీ, విమల, ముప్పాళ్ల నాగేశ్వరావు, రంగనాయుడు, రామాంజనేయులు, బాబా ఫకృద్దీన్, సుబ్బరాయుడు, ధనుంజయుడు, నాగరాముడు పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

నంద్యాల టౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సోమవారం డయల్ యువర్ ఆర్ఎం (జిల్లా ప్రజారవాణాధికారి) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు సెల్ 9959224885 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఆరుతడి పంటలు సాగుచేసుకోండి

ఆళ్లగడ్డ: రబీసాగులో భాగంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. కేసీ, తెలుగుగంగ కాల్వల కింద అహోబిలం, బాచేపల్లి, చింతకుంట, మిట్టపల్లి గ్రామాల్లోని రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఆరుతడి పంటలు వేసుకోవడమే ఉత్తమైన మార్గం అన్నారు. పెట్టుబడులు తగ్గడమే గాక ఆశించినంత దిగుబడులు వస్తాయని చెప్పారు.

వేగంగా భూ రీసర్వే పనులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో చేపడుతున్న భూ రీసర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. వాలిడేషన్ ప్రక్రియలో భాగంగా శనివారం స్థానిక సచివాలయంలో రైతులతో గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. వీఆర్‌ఓ సాంబశివుడు, గ్రామ సర్వేయర్ గంగాధర్ మాట్లాడుతూ అన్‌నోన్, ఎవరైనా మృతి చెందిన వారు ఉంటే తగిన ధ్రువపత్రాలు అందించి పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. విషయాన్ని గ్రామ వలంటీర్లు రైతులకు తెలియజేయాలని సూచించారు. పీఎస్ శ్రీనివాసులు ఉన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతే లక్ష్యం

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం గంగపుత్రుల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు రాఘవరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్, జేసీ సమక్షంలో మత్స్యకారులకు 15 మోపెడ్‌లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అన్నదానానికి విరాళం

నంద్యాల(వ్యవసాయం): ప్రథమనంది ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానానికి దిశ డీఎస్పీ మారుతీరావు రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. శనివారం అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ముందుగా ప్రథమనందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడం మహా పుణ్యమన్నారు. అనంతరం కమిటీ సభ్యులు డీఎస్పీని సన్మానించారు.

బయో మెడికల్ వ్యర్థాలను వేస్ట్‌మేనేజ్‌మెంట్‌కు ఇవ్వాలి

నంద్యాల(సిటీ): ఆసుపత్రుల్లోని అన్ని రకాల వ్యర్థాలను బయోమెడికల్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ వారికి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. పురపాలక సంఘ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, హెల్త్ క్లినికల్‌లు, మెడికల్ షాపుల నుంచి వచ్చే బయోమెడికల్ వ్యర్థాలైన ఇంజెక్షన్లు, పగిలిన గాజు సీసాలు, సెలైన్ బాటిళ్లు, రేజర్లు, మానవ, జంతువుల శరీర భాగాలను బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వారికే అందజేయాలని సూచించారు. కేవలం తడి, పొడి చెత్తను మాత్రమే ఇంటింటికీ వచ్చే మున్సిపల్ కార్మికులకు ఇవ్వాలని, బయోమెడికల్ వేస్ట్‌ను చెత్తతో కలిపి ఇస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో రిలే దీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని కోరారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు నిర్మలమ్మ, గౌస్, లక్ష్మణ్, నాగరాణి పాల్గొన్నారు.

శివదీక్ష మోక్ష ప్రదాయం


ప్రవచనాలు వినిపిస్తున్న స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి

నంద్యాల(వ్యవసాయం): శివదీక్ష మోక్షప్రదాయమని హరిహరపురం పీఠాధిపతి శ్రీ స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి పేర్కొన్నారు. శనివారం ప్రథమ నందీశ్వర ఆలయంలోని గాయత్రీ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివదీక్ష పై ప్రవచనాలు వినిపించారు. శివదీక్ష నిష్ఠ నియమాలతో ఆచరిస్తే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో శుభప్రదంగా ఉంటుందన్నారు. శివుడు దయారస హృదయుడని భక్తుల మొరను ఆలకించి వరాలిచ్చే భోళా శంకరుడన్నారు. అనంతరం బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు ఆయనను సత్కరిచారు. మురళీకృష్ణ, నగరదోన సుధీర్, చిన్నపెసరవాయి సిద్ధాంతి రావినూతల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

నంద్యాల(అర్బన్): మండలంలోని కానాల గ్రామంలో పంచాయతీ అధికారులు శనివారం రహదారులు, డ్రైనేజీ ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ఆకమణలకు సంబంధించి ఇప్పటికే 14 నోటీసులు అందజేశారు. అయినా నిర్వాహకులను నుంచి స్పందన లేకపోవడంతో అధికారులు పోలీసు బందోబస్తు ఆర్అండ్ బీ రహదారికి ఇరువైపులా, డ్రైనేజీ కాల్వలపై ఉన్న ఆక్రమణలన తొలగించారు. స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైనా సర్పంచ్ బావమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర పర్యవేక్షణలో తొలగింపు పనులను చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ రహదారి ఆక్రమణలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైనేజీల ఆక్రమణతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. పెరుగుతున్న గ్రామ జనాభాకనుగునంగా ఆక్రమణల తొలగింపునకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయినుల సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు: ఉపాధ్యాయినుల సమస్యలను పరిష్కరించాలని, చైల్డ్ కేర్ లీవ్ జీవో విడుదల చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ భూమరాజు సురేష్ శర్మ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చైల్డ్ కేర్ లీవ్‌ను తమ సర్వీస్‌లో ఎప్పుడైనా వాడుకునేలా జీవో విడుదల చేయాలన్నారు. సంపాదిత సెలవులకు దరఖాస్తు చేసుకున్న వారికి నగదును త్వరగా జమ చేయాల, అలాగే మధ్యంతర భృతి 20% ఇవ్వాలని, త్వరగా 12వ పీఆర్‌సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు విజయరావు, శ్రీనివాసులు, సుబ్బారాయుడు నాయక్ పాల్గొన్నారు.